ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.00 (120.0900)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.45 (2.66)	59.87	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	99.21 (0.70)	1,249	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.124 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.206



యాదగిరిగుట్టలో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

నమో నారసింహ

» ప్రతిధ్వనించిన నృసింహ క్షేత్రం » వైభవంగా గిరిప్రదక్షిణ

భజన సంకీర్తనలు.. నమో నారసింహ నామస్మరణతో యాదగిరిగుట్ట పరిసర ప్రాంతాలు మార్మోగాయి. నృసింహుడు కొలువైన కొండచుట్టూ భక్తులు గిరిప్రదక్షిణ చేయగా, ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. సోమవారం వేకువజాము నుంచే భక్తులు గిరిప్రదక్షిణలో పెద్ద సంఖ్యలో పాల్గొనగా, యాదగిరి క్షేత్రంలో ఎక్కడ చూసినా గోవింద నామస్మరణే వినిపించింది. •7లో..



మూసీ ఆయకట్టులో నారు సిద్ధం చేసుకున్న రైతులు

మూసీపై ఆయకట్టు ఆశ

» పూర్తిస్థాయి నీటిమట్టానికి ఎనిమిది అడుగుల దూరంలో ప్రాజెక్టు
» సాగునీటి విడుదల కోసం ఎదురుచూస్తున్న రైతులు

ఉమ్మడి జిల్లాలో రెండో పెద్ద సాగు నీటి వనరు మూసీ ప్రాజెక్టు ప్రస్తుతం నిండుగా ఉంది. 645అడుగుల (4.46టీఎంసీ) నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు అక్టోబరు, నవంబరు మాసాల్లో వచ్చే తుపానులతో మాత్రమే నిండేది. కాగా, మూడేళ్లకుపైగా ఈ ప్రాజెక్టు హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల నుంచి నిరంతరాయంగా వచ్చే వృథా నీటితో ఎండాకాలంలో కూడా జలకళ సంతరించుకుంటోంది. ప్రస్తుత వానాకాల సీజన్‌లో ఆయకట్టుకు సాగునీటి విడుదలపై రైతాంగం గంపెడు ఆశలు పెట్టుకుంది. కాగా, కనీసం రోజువారీ ఇన్‌ఫ్లో కూడా లేకుండా ఆయకట్టుకు నీటిని ఎలా విడుదల చేస్తామన్న అభిప్రాయం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం డెడ్‌స్టోరేజీకి దిగువకు చేరగా, ఎగువ నుంచి ఎలాంటి వరద రాక జాడ కన్పించడం లేదు. దీంతో గత ఏడాది లాగే ఈ సారి సైతం క్రాప్‌హాలిడే విధించే అవకాశం ఉండటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. •7లో..

మరో క్రాప్‌హాలిడే తప్పదా?

» నీరులేక వెలవెల బోతున్న సాగర్ ప్రాజెక్టు » ఆయకట్టుకు నీటి కటకట
» రెండేళ్లుగా బీళ్లుగా మారిన భూములు » గత ఏడాదీ కొనసాగిన క్రాప్ హాలిడే

రుణమాఫీకి కసరత్తు

» బ్యాంకులకు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం
» రైతుల వివరాలు పంపించాలని ఆదేశాలు
» ఉమ్మడి జిల్లాలో 5లక్షల మందికిపైగా అర్హులు

రైతులు కొంత కాలంగా ఎదురుచూస్తున్న రుణమాఫీకి ప్రభుత్వం ఎట్టకేలకు మార్గదర్శకాలు విడుదల చేసింది. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను బ్యాంకర్లకు అప్పగించింది. రూ.2లక్షల వరకు రుణం మాఫీ కానుండగా, ఆగస్టు 15వ తేదీ లోగా ఈ ప్రక్రియను పూర్తిచేయనుంది. 2018 డిసెంబరు 12వ తేదీ లేదా ఆ తర్వాత మంజూరైన, రెన్యూవల్ అయిన రుణాలకు, 2023 డిసెంబరు 9వ తేదీ నాటికి బకాయి ఉన్న పంట రుణాలకు ఈ మాఫీ వర్తింపజేయనున్నారు. పౌరసరఫరాలశాఖ జారీ చేసిన ఆహారభద్రత కార్డును ఈ రుణమాఫీకి ప్రమాణికంగా తీసుకోనున్నారు. •7లో..



నల్లగొండ పట్టణంలో కురుస్తున్న వర్షం

ఉమ్మడి జిల్లాలో వర్షం

పలుచోట్ల మోస్తరుగా కురిసిన వాన

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. యాదాద్రి జిల్లాలో 14.9మిల్లీమీటర్ల సగటు వర్షపాతం, సూర్యాపేట జిల్లాలో 3.3మిల్లీమీటర్లు, నల్లగొండ జిల్లాలో 5.4 మిల్లీమీటర్ల సగటున వర్షపాతం నమోదైంది. అత్యధికంగా సూర్యాపేట జిల్లాలో నూతనకల్ మండలంలో 16.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. •6లో..



మీనం పంపిణీకి ఓకే

మత్స్యకారుల ఎదురుచూపులకు తెరపడనుంది. చెరువుల్లో వదిలేందుకు చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం టెండర్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ-ప్రాక్యూర్‌మెంట్ విధానంలో చేప పిల్లలకు పంపిణీకి ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఈనెల 23 వరకు టెండర్ దాఖలుకు గడువు. టెండర్లు ఖరారయ్యాక ఉమ్మడి జిల్లాలోని చెరువుల్లో నీరు అందుబాటులోకి వచ్చిన వెంటనే చేప పిల్లలను వదిలేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని మత్స్యశాఖ అధికారులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఉమ్మడి జిల్లాలో ఎనిమిదేళ్లుగా సాగుతున్న మాదిరిగానే ఈ దఫా కూడా ఉచితంగా చేప పిల్లలను చెరువుల్లో వదిలేందుకు మత్స్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

» ఉచితంగా చేప పిల్లలను అందించనున్న ప్రభుత్వం
» ఈ-ప్రాక్యూర్‌మెంట్ ద్వారా ప్రారంభమైన టెండర్ల ప్రక్రియ
» ఈనెల 23న ముగియనున్న గడువు, అదే రోజు పరిశీలన
» టెండర్లలో సిండికేట్‌కు చెక్‌పడేనా?
» ఉమ్మడి జిల్లాలో 12కోట్ల చేపపిల్లల పంపిణీకి ఏర్పాట్లు

మత్స్యకారులకు ప్రభుత్వం అండగా ఉండాలనే ఉద్దేశంతో ఉచితంగా చేపపిల్లలను అందజేసే పథకాన్ని ఎనిమిదేళ్ల క్రితం గత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ పథకం కొనసాగుతుందా? లేదా? అనే సందిగ్ధత కొనసాగింది. అయితే మత్స్యకారుల నుంచి, మత్స్యసహకార సంఘాల నుంచి చేపపిల్లల పంపిణీ ప్రక్రియను కొనసాగించాలనే అభిప్రాయం రావడంతో ఆ మేరకు ప్రభుత్వం యథాతథంగా చేపపిల్లల పంపిణీకి నిర్ణయించింది. అందుకోసం సోమవారం నుంచి టెండర్లను ఆహ్వానించింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3.5ఎంఎం, 4.5ఎంఎం, 8.0ఎంఎం పొడవున్న చేప పిల్లలను చెరువుల్లో వదలాలని నిర్ణయించి, వాటి సరఫరా చేసేందుకు సోమవారం మూడు జిల్లాల కలెక్టర్లు టెండర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 23వరకు టెండర్లను ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానంలో ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తారు. 3.5ఎంఎం, 4.5ఎంఎం చేపపిల్లలకు ప్రభుత్వం 61పైసలు ధరగా నిర్ధారించగా, 8ఎంఎం చేప పిల్లలకు రూ.1.61గా ధరను నిర్ణయించింది. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాల నిర్వాహకులు ఈ-టెండర్లలో పాల్గొంటారు. టెండర్లను 23వ తేదీ సాయంత్రమే తెరిచి తక్కువ ధర కోట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్ట్ అప్పగిస్తారు. ఎంపికైన కంపెనీలకు చెందిన చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలను అధికారుల కమిటీ పరిశీలించి, టెండర్‌దారుడు సరఫరా చేయగలుగుతారనే నిర్ధారణకు వస్తేనే టెండర్‌ను ఖరారు చేస్తారు. మొత్తంగా నెలాఖరులోగా ఈ ప్రక్రియను పూర్తిచేసి ఆగస్టు మొదటివారం నుంచి చెరువుల్లో చేప పిల్లలను వదిలే కార్యక్రమానికి మత్స్యశాఖ సిద్ధమైంది.

టెండర్ల అనంతరం చేప పిల్లల పంపిణీ



చెరువుల్లో చేప పిల్లలు వదిలేందుకు ఉచితంగా పంపిణీకి టెండర్ల ప్రక్రియ మొదలైంది. ఈ-ప్రాక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ల స్వీకరణ కొనసాగుతుంది. టెండర్ల ఎంపిక పూర్తయ్యాక టెండర్‌దారులకు చెందిన ఉత్పత్తి కేంద్రాలను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించి, టెండర్‌ను ఖరారు చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత ప్రభుత్వం నిర్దేశించే కార్యక్రమం మేరకు చేప పిల్లలను చెరువుల్లో వదిలేందుకు పంపిణీ చేస్తాం. భారీ వర్షాలు లేకపోవడంతో చెరువుల్లో నీరు లేదు. నీరు చేరే చెరువులను ఎంపికచేస్తూ చేప పిల్లలను వదిలేందుకు రూట్‌మ్యాప్ నిర్ణయిస్తాం. ఆగస్టు మొదటి వారం నుంచి చెరువుల్లో చేప పిల్లలను వదిలే కార్యక్రమం ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

- ఎం.వెంకయ్య, నల్లగొండ జిల్లా మత్స్యశాఖాధికారి

జిల్లా	మత్స్య సంఘాలు	మొత్తం సభ్యులు	చెరువులు	చేపపిల్లలు (కోట్లలో)	వ్యయం (కోట్లలో)
నల్లగొండ	249	27,000	1,153	6.00	7.00
సూర్యాపేట	156	15,366	620	3.41	3.91
యాదాద్రి	187	10,000	658	2.71	3.50
మొత్తం	592	52,366	2,431	12.12	14.41


ఉమ్మడి జిల్లాలో 12కోట్ల చేప పిల్లలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గత ఏడాది వరకు సుమారు 2,431 చెరువుల్లో 12కోట్ల చేప పిల్లలను వదిలారు. ఈ సారి వర్షాలు వెనకంజ వేయడంతో చెరువుల్లో నీరు చేరకపోవడంతో చేప పిల్లల పంపిణీ ఇంకా ప్రారంభం కాలేదు. అయితే టెండర్ల ప్రక్రియ తాజాగా మొదలవడంతో ఆగస్టు మొదటివారం నుంచి చెరువుల్లో చేప పిల్లలను వదిలేందుకు అధికారులు సిద్ధమయ్యారు. జిల్లాలో రవ్వ, బొచ్చ, మృగాల, బంగారు తీగ రకాల చేప పిల్లలను చెరువుల్లో వదలనున్నారు. ఉమ్మడి జిల్లాలో 592 మత్స్యసహకార సంఘాలు ఉండగా, 53వేల మంది వరకు సభ్యులు ఉన్నారు.

టెండ'రింగ్'కు చెక్‌పడేనా?

ఉమ్మడి జిల్లాలో గత ఎనిమిదేళ్లుగా ఏపీ రాష్ట్రానికి చెందిన కొన్ని కంపెనీలే చేప పిల్లలను సరఫరా చేస్తున్నాయి. టెండర్ల దాఖలు సమయంలోనే సిండికేటై వారనుకున్న ధరకే కాంట్రాక్ట్ దక్కించుకోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ సారైనా అలాంటి పొరపాట్లు జరగకుండా ఉన్నతాధికారులు పారదర్శకంగా టెండర్ల ప్రక్రియ నిర్వహించాలనే డిమాండ్లు వస్తున్నాయి. ఈ-ప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు దాఖలుచేసే ఉత్పత్తిదారులు చేప పిల్లల ఉత్పత్తికి అవసరమైన వనరులున్నాయని తప్పుడు పత్రాలు సమర్పించి, టెండర్లు దక్కాక ఏపీ రాష్ట్రం నుంచి పిల్లలు తెచ్చి చెరువుల్లో వదులుతున్నారని,ఇలాంటి దళారులను గుర్తించిచెక్‌పెట్టాలని మత్స్యసహకార సంఘాల సభ్యులు కోరుతున్నారు.





వరుస ఎన్నికల హడావుడి ముగిశాక నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేలు దృష్టిసారించారు. ఈ నేపథ్యంలో నిధులు సమస్యగా మారడంతో వారు సతమతమవుతున్నారు. నియోజకవర్గాల పరిధిలో పలు శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు విన్నవిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఏ శాఖకు కూడా నిధులు కేటాయించలేదు.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

నిధులు కావలెను

» మంజూరు కోసం ఎమ్మెల్యే వేట » ప్రతిపాదనలతో సీఎం, మంత్రులతో భేటీలు » నియోజకవర్గాల అభివృద్ధిపై విన్నపాలు

శాసనసభ ఎన్నికలను అన్నీ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. హోరాహోరీగా జరిగిన పోరులో ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు ఎన్నికల సందర్భంలో ప్రజలకు పలు హామీలు ఇచ్చారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పాటు అనంతరం పార్లమెంట్, ఎమ్మెల్సీ ఉప ఎన్నిక రావడం, ఎన్నికల కోడ్ అమలులోకి ఉండటంతో అభివృద్ధి పనులు, హామీలపై ఎమ్మెల్యేలు దృష్టిసారించలేకపోయారు. అంతేగాక నియోజకవర్గాల్లో పలు అభివృద్ధి పనులకు బ్రేక్ పడింది. ఎన్నికలు పూర్తికావడం, కోడ్‌ను ఎత్తివేయడంతో ఎమ్మెల్యేలు నియోజకవర్గం బాటపట్టారు. ఇచ్చిన హామీలు, అభివృద్ధి పనులను సమీక్షించి అధికారుల నుంచి పూర్తి నివేదికను తీసుకున్నారు. వాటిని తీసుకొని సీఎంతోపాటు, మంత్రుల వద్దకు వెళ్లి నిధులు మంజూరు చేయాలని విన్నవిస్తున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోని ఏ గ్రామానికి వెళ్లినా అపరిష్కృతంగా ఉన్న పనులతో పాటు నూతనంగా చేపట్టే పనులపై స్థానిక నేతలు, ప్రజలు వారి దృష్టికి తీసుకొస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి ఎమ్మెల్యేకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. బడ్జెట్ కేటాయింపులు జరిగినా, శాఖల వారీగా నిధులు విడుదల కాలేదు. దీంతో అన్ని శాఖల్లో చేపట్టాల్సిన పనులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. స్థానిక నేతలు, ప్రజలు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై నిధులలేమి కారణంగా వారు సరైన హామీ, సమాధానం ఇవ్వలేకపోతున్నారు.

సాగునీటి శాఖకు భారీగా నిధులు అవసరం

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. సాగునీటి ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో ఉన్నాయి. సాగర్, ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకం (ఏఎమ్మార్పీ), మూసీ, బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్, దేవాదుల ఎత్తిపోతల పథకం, డిండి ఎత్తిపోతల పథకం, తపాస్‌పల్లితో పాటు, పలు కాల్వల ఆధునికీకరణ, పునరుద్ధరణ పనులు చేపట్టాల్సి ఉంది. సాగునీటి పరంగా చేపట్టాల్సిన పనులకు కోట్ల రూపాయల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. బస్వాపూర్ రిజర్వాయర్‌తో పాటు పలుచోట్ల ప్రధాన కాల్వల పనులు చేపట్టగా, డిస్ట్రిబ్యూటరీ కాల్వల పనులు చేపట్టాల్సి ఉంది. అదేవిధంగా నూతనంగా పలు పనులు చేపట్టాల్సి ఉంది. అందుకు భారీ మొత్తంలో నిధులు అవసరం. మూసీ నదిని ప్రక్షాళిస్తామని ఎన్నికల సందర్భంలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు మూసీ రివర్‌ఫ్రంట్ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళికలు చేపట్టాల్సి ఉంది. అయితే వీటన్నింటినీ చేపట్టాలంటే నిధులు సమకూర్చాల్సి ఉంది. ఈ మేరకు ఎమ్మెల్యేలంతా నిధుల మంజూరు కోసం సీఎంతోపాటు మంత్రులతో మంతనాలు చేస్తున్నారు.

బ్రిడ్జీలు, రోడ్ల నిర్మాణానికి..

ఉమ్మడి జిల్లాలోని పలుప్రాంతాల్లో బ్రిడ్జిలు, రోడ్లను నిర్మించాల్సి ఉంది. వీటి నిర్మాణంతో దూరాభారం తగ్గడంతో పాటు ప్రమాదాలను అరికట్టవచ్చు. భువనగిరి నియోజకవర్గంలో మూసీవాగుపై రుద్రవెల్లి, సంగెం, వలిగొండలో బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. ఈ మేరకు గత ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించినా, నిధులు అరకొరగా మంజూరు చేయడంతో పనులు నిలిచిపోయాయి. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లోనూ పలుచోట్ల బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. భువనగిరి-చిట్యాల రోడ్డును నాలుగులేన్లుగా మార్చేందుకు గతంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ రోడ్డు నుంచి విజయవాడ నుంచి కరీంనగర్, వరంగల్ జిల్లాల వైపు వెళ్లే లోడ్ లారీలు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తాయి. సుదూరం నుంచి వచ్చే హెవీ వెహికల్స్‌తో ఇరుకైన రోడ్డు కారణంగా తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రహదారిని వెంటనే నాలుగులేన్లుగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. నగరీకరణ పెరుగుతుండటంతో హైదరాబాద్-నాగార్జునసాగర్ రోడ్డు రద్దీగా మారింది. ఈ రోడ్డును కూడా నాలుగులేన్లుగా మార్చాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని లింకు రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.150 కోట్లు అవసరమని ప్రాథమిక అంచనా. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరోసారి తాజాగా ప్రతిపాదనలు రూపొందించనున్నారు.

గ్రామీణ ప్రాంత ఆవిష్కరణల కోసమే ఇన్నోవేషన్

కలెక్టర్ నారాయణరెడ్డి



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

నల్లగొండ టౌన్, జూలై 15: గ్రామీణ ప్రాంత ఆవిష్కర్తలకు సాధికారత కల్పించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని రూపొందించిందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో నూతన ఆవిష్కరణల దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానిస్తోందన్నారు. ఆగస్టు 3లోగా ఆవిష్కరణలకు సంబంధించిన చిత్రాలు, వీడియోలను సెల్ ఫోన్ నెంబర్ 9100678543కు వాట్సప్ ద్వారా పంపించాలని కోరారు. ఆవిష్కరణకు సంబంధించిన వివరణ 100 పదాలతో రాసి పంపించాలని, నాలుగు ఫొటోలు, రెండు నిమిషాల వీడియోను పంపాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి డి.రాజ్యలక్ష్మి, స్పెషల్ కలెక్ట ర్ నటరాజ్, డీపీవో మురళి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను పరిష్కరించాలి

'ప్రజావాణి' ఫిర్యాదులను ఎప్పటికప్పుడే పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజావాణి'లో ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకొని మాట్లాడారు. ఫిర్యాదులను ఒకటికి రెండుసార్లు పరిశీలించి, బాధితులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో జాప్యం చేయకూడదని, మండల, గ్రామస్థాయిలో సైతం ఇదే విధానాన్ని అనుసరించాలన్నారు. కాగా సోమవారం 78 ఫిర్యాదులు రాగా, వాటిలో వ్యక్తిగత సమస్యలు, భూ సంబంధిత సమస్యలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, హాస్టల్ సీట్లు వంటివి అధికంగా ఉన్నాయి.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నారు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే సామేలు



వ్యవసాయ పనుల్లో ఎమ్మెల్యే సామేలు

అడ్డగూడూరు, జూలై 15: పలు సమస్యలు విన్నవించేందుకు వచ్చే ప్రజలు, అధికారులతో సమావేశాలు, నాయకులతో మంతనాలు ఇలా నిత్యం బిజీగా ఉండే తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు వ్యవసాయ పనులు చేశారు. అడ్డగూడూరు మండలం ధర్మారంలోని తన వ్యవసాయ క్షేత్రంలో బురద పొలంలోకి దిగి, ఎడ్ల బండి నడిపి, మహిళలకు నారు పంచి ఉత్సాహపరిచారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

టాప్రా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పందిరి శ్యాంసుందర్

నల్లగొండ టౌన్, జూలై 15: రాష్ట్రంలో పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షన్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి (జేఏసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పెండింగ్‌లో వున్న నాలుగు విడతల కరువు భత్యం (డీఆర్)ను జూలై 2022 నుంచి మంజూరు చేయాలని, రెండో పీఆర్సీని అమలు చేయాలని, ఐఆర్‌ను 5శాతం నుంచి 20శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీంను అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అమలు చేయాలని,జిల్లాకు రెండు వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేసి నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న పెన్షనర్లకు ప్రత్యేక ఇన్సెంటివ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పన్నాల గోపాల్‌రెడ్డి, దాడి భాస్కర్‌రెడ్డి, ఎం.సోమయ్య, కుకుడాల గోవర్ధన్, వనం వాణిశ్రీ, ఎస్.యాదయ్య, బి.రాఘవరెడ్డి, జి.రాములు, పి.రమణారెడ్డి, పులి కృష్ణమూర్తి, కోడి మల్లయ్య, పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియచేస్తున్న పెన్షనర్లు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో

మోస్తరు వర్షం



నల్లగొండ జిల్లాకేంద్రంలో కురుస్తున్న వర్షం

యాదాద్రి(ఆంధ్రజ్యోతి), సూర్యాపేట టౌన్, నల్లగొండ, జూలై 15: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. యాదాద్రి భువనగిరి జిల్లాలో 14.9 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. రామ న్నపేట మండలంలో అత్యధి కంగా 4సెంటీమీటర్లు, తుర్కపల్లి మండలంలో అత్యల్పంగా 1.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా నూతనకల్ మం డలంలో 16.8మిల్లీమీటర్లు, అత్యల్పంగా గరిడేపల్లి మం డలంలో 0.2 మిల్లీమీటర్ల వర్షం కురియగా, జిల్లాలో 3.3 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో అత్యధికంగా 3.5 సెంటీమీటర్లు, అత్యల్పంగా దేవరకొండ మం డలంలో 1.6 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సగటున 5.4 మిల్లీమీటర్ల వర్ష పాతం నమో దైంది. దేవర కొండ, డిండి, కొండమల్లేపల్లి, చింతపల్లి, నాంపల్లి, పీఏపల్లి మండలాల్లో ముసురుతో కూడిన వర్షం కురుస్తోంది.

భారీ వర్షాల కోసం రైతుల ఎదురుచూపు

జిల్లాలో రెండురోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. అయితే రైతులు ఆశించిన స్థాయిలో కురియడంలేదు. గత సంవత్సరం వానాకాలంలో పలు మండలాల్లో 20 నుంచి 50మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇప్పటికే జిల్లాలోని పలు ప్రాంతాల్లోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెరువులు అలుగులు పారాయి. ఈసారి భారీ వర్షాలు లేకపోవడంతో చెరువుల్లోకి నీరు చేరడంలేదు. మరోవైపు హైదరాబాద్ నగరంతో పాటు జిల్లాలో భారీ వర్షాలు కురియడంతో మూసీ నది ఉగ్రరూపం దాల్చి, పరవళ్ల తొక్కింది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు కూడా నిలిచిపోయాయి. ఈ సారి చిరు జల్లులతోపాటు మోస్తారు వర్షాలు మాత్రమే కురుస్తున్నాయి. అన్ని మండలాల్లోనూ సాధారణ వర్షపాతం కంటే అత్యధికంగా ఉండేది. ప్రస్తు తం జూన్ నుంచి ఇప్పటివరకు సాధారణంగా జిల్లాలో 167.9 మిల్లీలీటర్ల వర్షపాతం నమోదు కావాలి. జూలై 15వ తేదీ వరకు 159.7 మిల్లీలీటర్ల వర్ష పాతం నమోదైంది. జిల్లాలో సగటున 5.0మిల్లీలీటర్ల వర్షపాతం తక్కువగా ఉంది. పలు మండలాల్లో భారీగా వ్యత్యాసం ఉంది.

503 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా సోమవారం సాయంత్రానికి 503అడుగులుగా (120.0900టీఎంసీలు) నమోదైంది. జంట నగరాల తాగునీటి అవసరాల నిమిత్తం ఎస్ఎల్‌బీసీ ద్వారా 800క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 800 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా, ఎగువ నుంచి ఎటువంటి నీటి రాక లేదు. సాగర్ నుంచి కుడి, ఎడమ, వరద కాల్వలకు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి నీటి విడుదల లేదు.

స్టీరింగ్ రాడ్ విరిగి ఇటుక లారీ పల్టీ



చెరువులోకి దూసు కెళ్లిన లారీ ఇంజన్

భూదాన్‌పోచంపల్లి, జూలై 15: ఇటుక లోడుతో వెళ్తున్న లారీ మార్గమధ్యలో స్టీరింగ్ రాడ్ విరగడంతో అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ సంఘ టన యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంప ల్లి మండలం జలాల్‌పూర్ గ్రామ శివారులో సోమవారం జరిగింది. ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కుషాయి గూడలోని అడ్డాపై ఉన్న లారీ ఇటుక లోడుతో సోమవారం ఉదయం భూదాన్‌పోచంపల్లి మండలం నారాయణగిరి ఇటుక బట్టీలో ఇటుక లోడు చేసుకుని కుషాయిగూడకు బయల్దేరింది. ఈ సమయంలో నారాయణగిరి శివారులో టీఎస్ మోడల్ స్కూల్ మీదుగా రుద్రవెల్లి టు ఘట్‌కేసర్ మీదుగా వెళ్లేందుకు డ్రైవర్ పవన్ లారీని నడిపిస్తున్నాడు. జలాల్‌పూర్ చెరువు సమీపంలోకి రాగానే మూలమలుపు వద్ద స్టీరింగ్ రాడ్ విరిగి పోయింది. ఒక్కసారిగా లారీ అదుపుతప్పి ఇంజన్ నుంచి లారీ విడిపోవడంతో ఇంజన్ సరాసరి చెరువులోకి దూసుకెళ్లింది. బాడీలో ఉన్న ఇటుక లోడు పూర్తిగా రోడ్డుపై పడింది. కాగా ఇంజన్‌తో సహా చెరువులో పడిన లారీ నుంచి డోరు తీసి డ్రైవర్ చాకచక్యంతో వెంటనే బయటపడ్డాడు. దీంతో భారీ ప్రమాదం తప్పి నట్లయింది. ఈ సంఘటనపై ఎస్ఐ భాస్కర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

100 కిలోల బెల్లం స్వాధీనం

హుజూర్‌నగర్, జూలై 14: సారా తయారీ కోసం తరలిస్తున్న 100 కేజీల బెల్లాన్ని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ నాగా ర్జునరెడ్డి సోమవారం తెలిపిన వివరాల ప్రకారం... ఎలాంటి అనుమతులు లేకుండా సారా తయారీకి వాహనంపై బెల్లం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పట్టణంలోని బస్టాండ్ వద్ద ఆకస్మికంగా దాడి చేసి బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కిరాణ వ్యాపారి చంద్రశేఖర్ బెల్లాన్ని సారా తయారీ కోసం విక్రయిస్తున్నట్లు గుర్తించినట్లు సీఐ తెలిపారు.

రెండు గొర్రెపోతుల అపహరణ

మద్దిరాల, జూలై 15: సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామంలో ఆదివారం రాత్రి రెండు గొర్రెపోతులను అపహరిం చారు. బాధితుడు గాడుదల లింగయ్య సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి ముందు గొర్రెల కోసం కొట్టం వేశానని అందులో ఉన్న రెండు గొర్రెల పోతులను గుర్తు తెలియని వ్యక్తులు కారులో అపహరించి నట్లు తెలిపారు. గొర్రె పోతుల విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని తెలిపాడు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

హైవేపై ప్రమాదకర గుంత

● ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్ర వాహనదారులు



రోడ్డుపై ఏర్పడిన గుంత, గాయపడిన ద్విచక్ర వాహనదారుడు

నాగారం, జూలై 15: రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలో పడి నలుగురు ద్విచక్ర వాహనదారులు గాయపడ్డారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా నాగారం బంగ్లా ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో పేరబో యినగూడెం గ్రామానికి వెళ్లే క్రాసింగ్ వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. సుర్యాపేట-జనగాం జాతీయ రహదారి 365బీ పై గుంత ఏర్ప డింది. పేరబోయినగూడెం గ్రామ సమీపంలో ఉన్న బిక్కేరు వాగులో ఇసుక తరలించడానికి పెద్దసంఖ్యలో లారీలు ఓవర్‌లోడ్‌తో సుర్యాపేట-జనగాం జాతీ య రహదారిపై నుంచి వెళ్తుంటాయి. గ్రామం నుంచి ఇసుక లోడ్‌తో లారీలు హైవేకు తిరిగే క్రమంలో రహదారి దెబ్బతిని బీటీ తేలి రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. సోమవారం సాయంత్రం గుంతలో పడి జనగాం జిల్లా కొడకండ్ల గ్రామానికి చెందిన ఇద్దరు ద్విచక్ర వాహనదారులు, మరో ప్రమాదంలో యదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడురు మండలం ధర్మారం గ్రామానికి చెందిన కత్తుల రోషయ్య అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. హైవే అథారిటీ అధికారులు గుంతను పూడ్చపోకవడంతో వర్షాకాలంలో గుంతలో నీరు చేరి వాహనదారులకు గుంత కనపడకుండా ఉంది. ప్రమాదాలకు కారణమవుతున్న గుంతను పూడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మూసీపై ఆయకట్టు ఆశ

- పూర్తిస్థాయి నీటిమట్టానికి ఎనిమిది అడుగుల దూరం
- సాగునీటి విడుదల కోసం ఎదురుచూస్తున్న రైతులు



ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద సాగు నీటి వనరు మూసీ ప్రాజెక్టు. వరద నీటితో ప్రస్తుతం నిండుగా ఉంది. 645అడుగులు(4.46టీఎంసీ)ల నీటినిల్వ సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు అక్టోబరు, నవంబరు మాసాల్లో వచ్చే తుపానులతో మాత్రమే నిండేది. మూడేళ్లకుపైగా ఈ ప్రాజెక్టు హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల నుంచి నిరంతరాయంగా వచ్చే వృథా నీటితో ఎండాకాలంలో కూడా జలకళ సంతరించుకుంటుంది.

- కేతేపల్లి

ప్రాజెక్టులో చేరే పూడికను బయటకు పంపేందుకు వీలుగా 10స్కవర్‌గేట్లు, వరద నీటిని దిగువకు వదిలేందుకు ఎనిమిది క్రస్టుగేట్లు, 12రెగ్యులేటరీ గేట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. 645అడుగుల (4.46 టీఎంసీలు)నీటినిల్వ సామర్థ్యంతో ఈ ప్రాజెక్టుకు నాడు రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడ, నల్లగొండ నియోజకవర్గాల పరిధిలోని 40 గ్రామాలకు చెందిన 41,800 ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి పంట సాగుకు నీటిని అందించేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆశించిన మేరకు పరివాహక ప్రాంతాల నుంచి వరద నీరు ప్రాజెక్టులో చేరకపోవడంతో 1973లో దీనిని రబీలో ఆరుతడి పంటల సాగుకు నీటిని అందించే ప్రాజెక్టుగా మార్చిన అధికారులు సాగు విస్తీర్ణాన్ని 33వేల ఎకరాలకు కుదించారు. ఆ తర్వాత 30వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకే ప్రాజెక్టు పరిమితమైంది.

బిక్కేరు, ఆలేరు వాగులు మూసీకి ప్రధాన నీటి వనరులు

మూసీ ప్రాజెక్టుకు నాటి నుంచి వరంగల్ జిల్లాకు చెందిన రెండు వాగులు నీటి వనరులుగా ఉన్నాయి. వీటిల్లో జనగామ నుంచి వచ్చే బిక్కేరువాగు ప్రధానమైనది. బిక్కేరువాగు అర్వపల్లి మండలం లోని వర్ధమానుకోట వద్ద మూసీలో సంగమిస్తుంది. మూసీకి నీటి వనరుగా ఉన్న ఆలేరు వాగు తిరుమలగిరి మండలంలోని తాటిపాముల గ్రామం వద్ద మూసీలో కలుస్తుంది. ప్రతి ఏటా అక్టోబరు, నవంబరు మాసాల్లో వచ్చే వరదలతో ఈ వాగుల నీరు మూసీ ప్రాజెక్టుకు చేరుతుంది. ఈ క్రమంలో హైదరాబాద్ జంటనగరాల నుంచి నిరంతరాయంగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో ఎగువ మూసీ నది జీవనదిగా మారింది. ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి వరద నీటితో కలిసి వచ్చే వ్యర్థాలతో కూడిన పూడిక రిజర్వాయర్‌లో చేరడంతో ప్రతి ఏడూ మూసీ ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోంది.

రెండేళ్లుగా రెండు పంటలకు సమృద్ధిగా అందిన నీరు

యాసంగిలో ఆయకట్టులోని దాదాపు 40వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మితమైన ఈ ప్రాజెక్టు ప్రతి ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో వచ్చే రుతుపవన, తుపానులకు పొంగిపొర్లే అనవాయితీ. ఇందుకు భిన్నంగా మూడేళ్ల నుంచి నుంచి ఈ ప్రాజెక్టు వేసవిలోనూ నీటితో నిండుగా ఉంటుంది. దీంతో రెండేళ్లుగా ఆయకట్టులోని దాదాపు 30వేల ఎకరాల్లో వానాకాలం(ఖరీఫ్), యాసంగి(రబీ) రెండు పంటల సాగుకు నీటిని సరఫరా చేస్తున్నారు. హైదరాబాద్ జంటనగరాల నుంచి వచ్చే వృథా నీరంతా మూసీ నదిలో చేరి నేరుగా దిగువన గల ఈ ప్రాజెక్టు వచ్చి చేరుతోంది. దీంతో రబీ సీజన్‌కు సాగునీటి విడుదల చేసే నాడు 645అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టంతో ఉండే ప్రాజెక్టు నీటి విడుదల నిలిచిపోయే నాటికి(ఏప్రిల్ నెల చివరికి) 619అడుగుల కనిష్ఠ స్థాయికి పడిపోయేది. అయినా ఎగువ నుంచి నిరంతరాయంగా ఉండే ఇన్‌ఫ్లోతో ప్రాజెక్టు మే, జూన్ నెల మొదటి వారం నాటికి జలకళ సంతరించుకుంటూ వస్తోంది. 2023-24లో సైతం వేసవి ఆరంభంలో ఇన్‌ఫ్లో కొనసాగడంతో ప్రాజెక్టు నీటిమట్టం గత ఏప్రిల్ 27నాటికి 618అడుగుల కనిష్ఠ స్థాయి పడిపోయినా జూన్ నెల మొదటి వారం నాటికి 636.50 అడుగులకు చేరి ప్రాజెక్టు జలకళను సంతరించుకుంది. ఆ తర్వాత మూసీ ఎగువ, పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడం, జంట నగరాల నుంచి వచ్చే వృథా నీటిని ఎగువ ప్రాంత రైతాంగం మళ్లించుపోయి ఆ ప్రాంత చెరువులు, కుంటలు నింపుకుంటుండడంతో మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది. 20రోజులుగా ప్రాజెక్టు నీటి నిల్వలు రోజురోజుకూ అడుగంటుతున్నాయే తప్ప నీటి మట్టం పెరుగుదల లేకుండా పోయింది. 645అడుగులు(4.46టీఎంసీలు) పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 637.50అడుగులు(2.76టీఎంసీ)ల వద్ద నిలకడగా కొనసాగుతోంది.

సాగు నీటి విడుదలకు సమయం పడుతుంది



మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు నీటి విడుదలకు కొంత ఇంకా సమయం పడుతుంది. ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 637.45అడుగులుగానే ఉంది. నీటిమట్టం 642అడుగులకు చేరకుండా సాగునీటిని విడుదల చేస్తే రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించి నిర్ణయం తీసుకుంటాం.

- చంద్రశేఖర్, మూసీ ప్రాజెక్టు డీఈ.

ఈ వానాకాలం సాగునీటి విడుదలపై సందిగ్ధం

ప్రస్తుత వానాకాల సీజన్‌లో ఆయకట్టుకు సాగునీటి విడుదలపై రైతాంగం గంపెడు ఆశలు పెట్టుకుంది. రెండేళ్లలాగే ఈ ఏడాది సైతం వానాకాలం పంట సాగుకు నీటిని విడుదల చేస్తారనే భావనతో ఆయకట్టులో పలువురు రైతులు ఇప్పటికే వరి నార్ల పెంపకం చేపట్టారు. ఆయకట్టు భూముల్లో వ్యవసాయ బావులు, బోర్ల నీటి వసతి ఉన్న రైతులు వరి నాటుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 20రోజులుగా ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోవడంతో 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 637.49అడుగులు (2.67టీఎంసీ)ల వద్ద నిలకడగా ఉంది. దీంతో ఈ వానాకాలం సీజన్‌లో ఆయకట్టుకు సాగునీటి విడుదలపై సందిగ్ధత కొనసాగుతుంది. ప్రాజెక్టు నీటిమట్టం 637.49అడుగులుగా నేపథ్యంలో 645అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరడానికి దాదాపు 8అడుగుల మేర నీరు ప్రాజెక్టులోకి చేరాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాలని రైతాంగం కోరుతుండగా ప్రాజెక్టు అధికారులు మాత్రం ఆ దిశగా దృష్టి సారించినట్లు కనిపించడం లేదు. ప్రాజెక్టులో నీటి నిల్వలు సమృద్ధిగా లేకుండా పంటల సాగుకు నీటిని విడుదల చేస్తే ఆ తర్వాత ఎదురయ్యే పరిస్థితులు ఎలా ఉంటాయోనని అధికారులు ఆలోచనగా ఉన్నట్లు సమాచారం. కనీసం రోజువారీ ఇన్‌ఫ్లో కూడా లేకుండా ఆయకట్టుకు నీటిని ఎలా విడుదల చేస్తామన్న అభిప్రాయం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారుల నుంచి వ్యక్తమవుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం 641అడుగులకు చేరే వరకు ఆయకట్టుకు నీటి విడుదలపై ఎలాంటి నిర్ణయం తీసుకునే పరిస్థితి లేదని తెలుస్తుంది.



ఆయకట్టులో సాగుకు పెంచుతున్న వరి నారు

రుణమాఫీకి కసరత్తు

- ● బ్యాంకర్లకు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం
- ● రైతుల వివరాలు పంపించాలని ఆదేశాలు

నల్లగొండ, జూలై 15: రైతుల పంట రుణమాఫీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సోమవారం మార్గదర్శకాలు విడుదల చేయడంతో లబ్ధిదారుల ఎంపికపై బ్యాంకర్లు కసరత్తు చేయాల్సి ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పలు దఫాలుగా చేస్తామన్నా ప్రక్రియలకు ఆటంకాలు ఏర్పడిన అనంతరం అప్పటి ప్రభుత్వం రూ.99,999లను మాఫీ చేస్తూ నిర్ణయం తీసుకొని, కొంత మేరకు అమలు చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.2లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆగస్టు 15లోగా రుణమాఫీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో తాజాగా ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం అర్హులైన రైతులను ఎంపిక చేయాల్సిన బాధ్యత బ్యాంకర్లపై పెట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు 1,2లో కాలంలల్లో సమాచారాన్ని నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ డాటాలో రైతుల అర్హత, ప్రతి రైతుకు సంబంధించిన పంట రుణ ఖాతా వివరాలు వాస్తవంగా సమగ్రంగా ఉండాల్సి ఉంటుంది. ఈ పథకం కోసం జత చేసే ప్రతి డ్యాకుమెంట్‌పై, ప్రతి జాబితాపై బ్యాంకు బీఎస్‌వో డిజిటల్ సంతకం చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ మార్గదర్శకాలు ఉల్లంఘించి డాటా అందజేస్తే చట్ట ప్రకారం బ్యాంకులపై కూడా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. అదేవిధంగా రుణమాఫీ పొందడానికి రైతులు తప్పుడు సమాచారం ఇచ్చి పంట రుణాన్ని పొం దితే ఆ మొత్తాన్ని రైతులు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. ఆ సొమ్మును రికవరీ చేయడానికి వ్యవసాయశాఖ అధికారులకు బాధ్యత అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇక లీడ్ బ్యాంకు అధికారులు, మండలాల వారీగా సమావేశాలను ఏర్పాటు చేసి అర్హులను ఎంపిక చేయాల్సి ఉంది. వ్యవసాయ అధికారుల భాగస్వామ్యంతో ఖచ్చితమైన డేటాను నమోదు చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 5లక్షల మంది అర్హులైన రైతులు

2018 డిసెంబరు 12వ తేదీ నుంచి 2023 సంవత్సరం డిసెంబరు 9వ తేదీ వరకు రుణాలు పొంది అర్హులైన వారు ఉమ్మడి నల్లగొండ జిల్లా సుమారు 5లక్షల 36వేల మంది ఉన్నట్లు అనాధికార సమాచారం. గత ప్రభుత్వ హయాంతో పాటు ఇటీవల అధికార యంత్రాంగం చేసిన సర్వే ప్రకారం ఇంతమంది రైతులు అర్హత ఉన్నట్లు తెలిసింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంకర్లు పూర్తి స్థాయిలో కసరత్తు చేయాల్సి ఉంది. వారం నుంచి రెండు వారాల వరకు సమయం పట్టే అవకాశాలున్నాయి. బ్యాంకర్లు ఎంత త్వరగా అర్హుల జాబితా ఇస్తే అంతా త్వరితగతిన రుణమాఫీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆగస్టు 15లోగా అర్హులైన ప్రతి ఒక్కరికి రూ.2లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బ్యాంకర్లు ఇచ్చే నివేదిక ఆధారంగా రుణమాఫీ ప్రక్రియ ముందుకు సాగనుంది. రుణమాఫీకి సంబంధించి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సుమారు రూ.7500కోట్లు అవసరం ఉంటుందని అధికార యంత్రాంగం ప్రాథమికంగా అంచనా వేసింది. బ్యాంకర్లు తుది కసరత్తు చేస్తే అర్హుల జాబితా తగ్గడంతో పాటు రుణమాఫీ సొమ్ము కూడా తగ్గే అవకాశాలు లేక పోలేదు. మొత్తానికి రుణమాఫీ ప్రక్రియకు కసరత్తులు మొదలు కావడంతో రైతులు ఉత్సాహంగా ఉన్నారు. మార్గదర్శకాలలో కొంత గందరగోళం ఉండడంతో రుణమాఫీ అర్హుల జాబితాలో తమ పేరు ఉంటుందా లేదా అన్న ఆలోచనలో రైతులు ఉన్నారు. కటాఫ్ తేదీ ప్రకారం కొంత మంది రైతులు రుణాలు తీసుకొని తమకు డబ్బు సమకూరిన సమయంలో బ్యాంకర్లకు చెల్లించారు. వారు కొత్త రుణాలు తీసుకోకపోతే రుణమాఫీ వర్తిస్తుందా లేదా అని రైతులు సందేహంలో ఉన్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రక్రియ మొదలైంది

రాష్ట్ర ప్రభుత్వ జీవోతో పాటు మార్గదర్శకాలు విడుదల చేసిన నేపథ్యంలో రుణమాఫీ ప్రక్రియ మొదలైనట్లే. ప్రభుత్వ నిర్ణయం మేరకు అర్హులను బ్యాంకర్లు గుర్తించి నివేదిక ఇస్తారు. రుణమాఫీతో జిల్లాలోని రైతులకు పెద్దఎత్తున ప్రయోజనం చేకూరనుంది. అర్హులు జిల్లాలో ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీకి నిర్ణయం తీసుకోవడంతో జిల్లాలోని రైతులకు ఎంతగానో ఉపయోగపడునుంది.

● పి. శ్రవణ్ కుమార్, జేడీఏ నల్లగొండ.

పంట రుణమాఫీకి విధివిధానాలు ఇవే

మోత్కూరు: భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ రూ.2లక్షల వరకు పంట రుణమాఫీ వర్తించనుంది. ఈ పథకాన్ని స్వల్పకాలిక పంట రుణాలకు వర్తింపజేస్తారు. ఉమ్మడి జిల్లాలోని షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులతో పాటు వారి బ్రాంచ్‌ల నుంచి పంట రుణాలు తీసుకుంటే ఈ పథకాన్ని వర్తింపచేస్తారు. 2018 డిసెంబరు 12వ తేదీ లేదా ఆ తర్వాత మంజూరైన, రెన్యూవల్ అయిన రుణాలకు, 2023 సంవత్సరం డిసెంబరు 9వ తేదీ నాటికి బకాయి ఉన్న పంట రుణాలకు ఈ పథకాన్ని అమలు చేస్తారు. పౌరసరఫరాల శాఖ జారీ చేసిన ఆహారభద్రత కార్డును ప్రమాణికంగా తీసుకోనున్నారు. ఈ పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒక అధికారిని బ్యాంకు నోడల్ అధికారిగా(బీఎస్‌వో) నియమిస్తారు. ఈ నోడల్ అధికారి బ్యాంకులకు వ్యవసాయశాఖ అధికారులకు, ఎన్‌ఐసీకి మధ్య సమన్వయకర్తగా ఉంటారు. అర్హత కలిగిన రైతులకు రుణమాఫీ మొత్తాన్ని డీబీటీ పద్ధతిలో మంజూరు చేస్తారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ డేటాను బ్యాంకర్లు ఉపయోగించుకొని అందులో అవసరమైన మేరకు పరిగణనలోకి తీసుకుంటారు. ఏ కుటుంబానికైనా రూ.2 లక్షలకు మించి అప్పు ఉన్నట్టయితే రూ.2 లక్షలపైన ఉన్న అప్పు మొత్తాన్ని ఆ రైతు కుటుంబం ముందుగా బ్యాంకుకు చెల్లించాకే ప్రభుత్వం రూ. 2 లక్షలు మాఫీ జమ చేస్తుంది. ఒకే కుటుంబంలో రూ.2 లక్షలకు ఎక్కువ అప్పు ఉంటే ఆ కుటుంబంలో మహిళల పేరున ఉన్న అప్పు మొదట మాఫీ చేసి, ఆ తర్వాత మిగతా మొత్తాన్ని దామాషా పద్ధతిలో పురుషుల పేరున రుణం మాఫీ చేస్తారు. జీవోలో 4వ పేజీలో మినహాయింపులు కింద పేర్కొన్న మార్గదర్శకాల్లో ఈ రుణమాఫీ పునర్వ్యవస్థీకరించిన లేదా రీషెడ్యూలు చేసి రుణాలకు వర్తించదని పేర్కొన్నారు. దీని భావమేమిటన్నది తెలియక పలువురు రైతులు గందరగోళపడుతున్నారు. ప్రతి రైతుకు సంబంధించిన పూర్తి సమాచారం సేకరించడం కోసం 1,2 ప్రొఫార్మాలో అనేక అంశాలను పొందుపర్చారు. వాటిలో ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలి ఉంటుంది. ఏ మాత్రం పొరపాటు జరిగిన బ్యాంకర్లతో పాటు రైతు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది.

మరో క్రాప్‌హాలిడే తప్పదా?



సాగర్ జలాశయం ప్రస్తుత పరిస్థితి

- నీరులేక వెలవెల బోతున్న సాగర్ ప్రాజెక్టు
- ఆయకట్టుకు నీళ్ల కటకట
- రెండేళ్లుగా బీళ్లుగా మారిన భూములు
- గత ఏడాది క్రాప్ హాలిడే ప్రకటించిన ప్రభుత్వం

నాగార్జునసాగర్, జూలై 14: నీరులేక నాగార్జునసాగర్ ప్రాజెక్టు వెలవెలబోతోంది. తెలుగు రాష్ట్రాలకు అన్నం పెట్టే వరప్రదాయిని ఆయకట్టు రైతులకు కన్నీళ్లు తెప్పిస్తోంది. రెండేళ్లుగా ఆయకట్టులో 10లక్షల ఎకరాలు బీళ్లుగా మారాయి. ప్రాజెక్టులో నీళ్లు లేకపోవడంతో 2023-24 వ్యవసాయ సంవత్సరాన్ని రాష్ట్ర ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించింది. దీంతో గత ఏడాది సాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ ఆయకట్టులో బోర్లు, బావుల కింద సుమారు లక్ష ఎకరాలు మాత్రమే సాగు చేశారు. సాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాల్వ పరిధిలో నల్లగొండ, ఖమ్మం జిల్లాలో సాగవుతున్న ఆరు లక్షల ఎకరాలు సాగునీరు లేకపోవడంతో బీళ్లుగా మారాయి. 2017 తర్వాత మళ్లీ సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం కనిష్ఠ స్థాయికి దిగువకు చేరుకుంది. దీంతో గత ఏడాది సాగర్ ఆయకట్టుకు రెండు తెలుగు రాష్ట్రాలకు సాగునీరు అందించకుండా కేవలం తాగు నీటిని అందించడానికి మాత్రమే నీటి లభ్యత ఉండడంతో తాగునీటి అవసరాలకు మాత్రమే నీరు విడుదల చేశారు. ఈ ఏడాది జూలై రెండో వారం గడుస్తున్నా నేటి వరకు కృష్ణా బేసిన్ వర్షాలు పడకపోవడంతో సాగర్‌కు ఎగువన ఉన్న ప్రాజెక్టులన్నీ వెలవెల బోతున్నాయి. దీంతో సాగర్ ఆయకట్టు ఈ ఏడాది కూడా క్రాప్ హాలిడే తప్పదేమోనని రైతులు దిగాలుగా ఉన్నారు.

ఆరేళ్ల తర్వాత కనిష్ఠ స్థాయికి దిగువ..

సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం ఆరేళ్ల తర్వాత మరల కనిష్ఠ స్థాయికి దిగువకు చేరింది. దీంతో ఆయకట్టు పరిధిలో గ్రామాలకు తాగు నీరు అందిచడానికి, ఆయకట్టుకు సాగు నీటిని అందించడానికి కష్టంగా మారింది. ఈ ఏడాది సాగర్ నుంచి తాగు నీటి అవసరాలకు సాగర్ నీటిని 500 అడుగులు వరకు తీసుకోవచ్చునని కేఆర్ఎంబీ ప్రకటించింది. దీంతో ఎస్ఎల్‌బీసీ పుట్టంగండి ప్రాజెక్టు వద్ద అత్యవసర మోటార్లను ఏర్పాటు చేసి జంటనగరాలకు తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తాగు నీటి కోసం చెరువులు, కుంటలను రెండు నెలల క్రితమే నింపారు. మళ్లీ తాగునీటి ఇబ్బందులు ఎదురవుతుండడంతో కుడి, ఎడమ కాల్వలకు తాగునీటి కోసం సాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని ఇప్పటికే ఏపీ ప్రభుత్వం కేఆర్ఎంబీకు లేఖ రాసింది. తెలంగాణ ప్రభుత్వం కూడా త్వరలో లేఖ రాసే అవకాశముంది.




తొమ్మిది సంవత్సరాల్లో వానాకాలం నీటి విడుదల వివరాలు


సంవత్సరం	నాటి నీటి మట్టం (అడుగుల్లో)	నీటి విడుదల తేదీ
2014	515	ఆగస్టు 6
2015	510	నీటి విడుదల లేదు
2016	514.20	ఆగస్టు 26
2017	576	అక్టోబరు 31
2018	555	ఆగస్టు 23
2019	556	ఆగస్టు 11
2020	556	ఆగస్టు 7
2021	585	ఆగస్టు 5
2022	555	ఆగస్టు 31
2023	506	క్రాప్ హాలిడే


గోవింద నామస్మరణతో ‘గిరి’ ప్రదక్షిణ

- ● ఎనిమిది వేల మంది భక్తుల జయజయ ధ్వానాలు
- ● గిరి ప్రదక్షిణను ప్రారంభించిన విప్ అయిలయ్య



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు





మొక్క నాటుతున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, అర్చక స్వాములు

భువనగిరి అర్బన్, జూలై 15: యాదగిరి కొండచుట్టూ గోవింద నామస్మరణలు.. జయజయ ధ్వానాలు.. భక్తుల భజనలు.. లోక కల్యాణార్థం దశ దిశలా ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు గిరిప్రదక్షిణ చేపట్టారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో గిరిప్రదక్షిణ సోమవారం వైభవంగా జరిగింది. శిఖరం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఏకశిఖరవాసుని ఎడల తమ భక్తిని చాటుకున్నారు. పంచనారసింహుడిగా వెలిసిన దేవస్థానంలో సోమవారం భక్తజనకోటి గిరిప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య దశ దిశలా ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు ప్రత్యేకంగా దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన గిరి ప్రదక్షిణలో వేకువజాము నుంచే సుమారు ఎనిమిది వేల మంది భక్తులు పాల్గొన్నారు. పండగ వాతావరణంలో సాగిన ప్రదక్షిణ భక్త జన సందోహమైంది. ఈ ప్రదక్షిణకు రాష్ట్ర నలుమూలల నుంచే ఆదివారం రాత్రి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున గిరిప్రదక్షిణలో భాగమయ్యేందుకు భక్తులు తరలివచ్చారు. వేకువజాము నుంచి గిరిప్రదక్షిణ మొదలుపెట్టగా వైకుంఠ ద్వారం వద్ద ప్రత్యేక పూజలు చేసి అనంతరం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో పాటు ఈవో ఏ. భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి వేదమంత్రాల నడుమ అర్చకస్వాములు హారతి ఇవ్వగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విప్ గిరిపదక్షిణకు బయలుదేరగా భక్తజనులు ముం దుకు కదిలారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతినక్షత్రం సోమవారం సుమారు వెయ్యిమంది భక్తులతో వైకుంఠ ప్రాంతమంతా సందడిగా మారింది. వేకువజాము నుంచే గిరిప్రదక్షిణలో భక్తులు భాగస్వామ్యం కాగా అధికారికంగా ఉదయం 6.05గంటలకు వైకుంఠ ద్వారం నుంచి విప్, ఈవోతో కలిసి బయలుదేరి కొండచుట్టు రెండున్నర మేర 45నిమిషాల పాటు చుట్టివచ్చి తిరిగి వైకుంఠ ద్వారం చేరేసరికి మూడు వేల మందికి చేరుకుంది. ఆరగింపు సమయం 12గంటల వరకు ఆ రద్దీ అలాగే కొనసాగగా ఎనిమిది వేల మంది పాల్గొని వైకుంఠ ద్వారం వద్ద మొక్కులు తీర్చుకున్నట్లు అధికారులు తెలిపారు. భారీ సంఖ్యలో చేరుకున్న భక్తజన సందోహం తూర్పు రాజగోపురం నుంచి గర్భాలయంలోకి చేరుకుని స్వామిఅమ్మవార్లను దర్శించుకొని విప్ బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు చేశారు. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కమిషనర్ హనుమంతురావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు వేర్వేరుగా దర్శించుకున్నారు. ప్రధానార్చకుడు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు స్వాగతించి వేద మండపంలో వేద ఆశీర్వచనం చేయగా ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు ప్రత్యేకంగా స్వామివారి చిత్రపటంలో పాటు లడ్డు ప్రసాదం అందజేశారు.

గిరిప్రదక్షిణ విశిష్టత పెంచేందుకు..

గత నెలలో మాదిరిగానే ఈ నెల స్వాతి నక్షత్రం రోజు భక్తులను భాగస్వామ్య చేయడంలో ఆలయ అధికారుల కృషి ఫలించింది. రాష్ట్ర నలుమూలలకు గిరిప్రదక్షిణ, ఆలయ విశిష్టత నలు దిశలా వ్యాపించేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పాత ఆచారాలు పునరుద్ధరించి భక్తులకు సేవలు విస్తృతం చేయాలని విప్ ఆకాంక్షించారు. ప్రతి నెలా స్వాతినక్షత్రం రోజున గిరిప్రదక్షిణ దేవస్థానం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కొనసాగనున్నట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

మొక్కలు నాటిన విప్, అధికారులు

వన మహోత్సవంలో భాగంగా కొండకింద వ్రత మండపం ప్రాంగణంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మొక్కలు నాటారు. ఆ అనంతరం మల్లాపురం గోశాల, పట్టణంలోని వేద పాఠశాల ప్రాంగణాల్లో అధికారులు, పూజారులు, ఉద్యోగులు, సిబ్బంది వేర్వేరుగా మొక్కలు నాటారు. కొండపైన ప్రోటోకాల్ కార్యాలయం ఎదురుగా దేవాదాయ, ధర్మదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతురావు, వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు మొక్కలు నాటారు. రెండు వేల మొక్కలు నాటనున్నట్లు ప్రకటించిన ఆలయ అధికారుల ప్రణాళికల మేరకు కొండకింద వ్రత మండపం, మల్లాపురంలోని గోశాల, పట్టణంలోని వేద పాఠశాల ప్రాగంణంలో మొక్కలు నాటి భక్తులు వన మహోత్సవంలో భాగమయ్యారు. యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్‌కుమార్ పర్యవేక్షణలో పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం. రమేష్ బందోబస్తు నిర్వహించారు.

స్వామికి శతఘటాభిషేక పూజలు

స్వామివారి జన్మనక్షత్రం పురస్కరించుకొని ఆలయంలో వేకువజామున అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించారు. సుప్రభాత సేవతో మేల్కొలిపిన అర్చకస్వాములు స్వయంభువులకు ఆస్థానపరంగా ఆరాధించి కవచ మూర్తులకు హారతి నివేదించారు. ఆలయంలో 108 కలశాలను వాటిపై కొబ్బరికాయలు పేర్చి అందులో పంచామృతాలు నింపి పంచ సూక్త పఠనాలతో హోమం చేపట్టి ఉత్సవమూర్తులను, అలంకార మూర్తులను అభిషేకించారు. తులసీ దళాలతో సహస్రనామార్చనలు చేపట్టారు.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

ఆలయంలో నిత్య కైంకర్యాలు శాస్త్రోకంగా కొనసాగాయి. సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్టామూర్తులను అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవ చేపట్టి సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలోనూ నిత్యకైంకర్యాలు కొనసాగాయి. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 17,50,276 ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

31 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నిడమనూరు, నల్లగొండ క్రైం, జూలై 15: అక్రమంగా తరలిస్తున్న 31 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి, ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనలు నల్లగొండ జిల్లాలోని నిడమనూరు, నల్లగొండ పట్టణాల్లో చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండల పరిధిలోని శాఖాపురం గ్రామంలో 16క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం అప్పలమ్మగూడెం శివారు శీత్లాతండాకు చెందిన ధనావత్ జైపాల్, ధనావత్ కిషన్, ధనావత్ వేణు మండలంలోని శాఖాపురం గ్రామంలో కుమ్మరి సురేష్‌తో పాటు మరికొంత మంది వద్ద రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి గ్రామంలో నిల్వ చేశారు. సోమవారం బియ్యాన్ని ఆటోలో అక్రమంగా తరలిస్తుండగా సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి శాఖాపురం వద్ద ఆటోను పట్టుకున్నారు. ఆటోలో 16క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆటోను, బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులు గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా దాచేపల్లి, పిడుగురాళ్ల తదితర ప్రాంతాల్లో ఎక్కువ ధరలకు విక్రయిస్తుంటారని తెలిపారు. నల్లగొండ పట్టణంలోని 15 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని మదీనా కాలనీ (పెద్దబండ)కు చెందిన మహ్మద్ జుబేర్ పాష, ఆయన సోదరుడు ఫిరోజ్ పాష అక్రమంగా అశోక లేలాండ్ మినీ వ్యాన్ (టీఎస్ 12యూసీ 4130)లో 30 బస్తాలు (15 క్వింటాళ్ల) రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పానగల్ బైపాస్‌లోని లెప్రసీ కాలనీ వద్ద పట్టుకుని రేషన్ బియ్యంతో పాటు మినీ వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలి

● 'అమ్మమాట- అంగన్‌వాడీ బాట' లో అధికారులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తానని ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు అన్నారు. సోమవారం జిల్లాలోని పలు మండలాల్లోని గ్రామాల్లో 'అమ్మమాట- అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో పలువురు పాల్గొని మాట్లాడారు. బాలబాలికలను పూర్వ ప్రాథమిక విద్య కోసం అంగన్‌వాడి కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ప్రీస్కూల్ కార్యక్రమాలు, మంచి అలవాట్లు, ఆటా, పాటలు, పూర్వ గణిత నైపుణ్యాలు, సులభ పద్ధతిలో విద్యా బోధనలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నేర్పిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ 3 నుంచి 6 సంవత్సరాల చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థంగా నిర్వహించడానికి అంగన్‌వాడీలకు శిక్షణ కూడా ఇచ్చినట్లు తెలిపారు.

● చింతపల్లి మండలకేంద్రంలోని 4వ, ఘడియాగౌరారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సీడీపీవో లావణ్యకుమారి పాల్గొన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాల్లో బడిబాట, అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుగుణ, అంజమ్మ, టీచర్లు పద్మావతి, అంజలి, లక్ష్మి, వెంకటమ్మ, వీణ, హెచ్‌ఎం పద్మ పాల్గొన్నారు.

● శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, లలిత, అంగన్‌వాడీ టీచర్లు తరాల శోభారాణి, లలిత, వసంత, అనిత తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లి: ఘడియాగౌరారంలో పాల్గొన్న సీడీపీవో లావణ్యకుమారి

● తిప్పర్తి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్. సునీత పాల్గొని మాట్లాడారు. చిన్నారుల మొదటి అడుగు అంగన్‌వాడీ సెంటర్‌లతోనే ప్రారంభమవుతుందని అన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశాలు, ఉపాధ్యాయులు, కిషోర బాలికలు, పాల్గొన్నారు.

● వేములపల్లి మండలంలోని సల్కునూరు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్ జ్యోతి, హెచ్‌ఎం కొండయ్య, టీచర్లు నగేష్‌నాయక్, సైదిరెడ్డి, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో 'అమ్మమాట - అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు, ఉపాధ్యాయులు, పిల్లలు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుడితండా గ్రామపంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సతీష్ పాల్గొని మాట్లాడారు. బాలబాలికలను పూర్వ ప్రాథమిక విద్య కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేష్, అంగన్‌వాడీ టీచర్ ఎన్.విజయ, బాజు, రజిత తదితరులు పాల్గొన్నారు.



తిప్పర్తి : ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

● ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి, జూలై 15: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ, సహకారాలు అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని శెట్టిపాలెం ప్రాథమిక పాఠశాలకు దాత చల్లబొట్ల మాధవరెడ్డి టీవీ, నోట్‌బుక్స్ అందించగా వాటిని సోమవారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హులైన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అనంతరం సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ఆయన విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తమ్మడబోయిన అర్జున్, పార్టీ మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, మాజీ ఎంపీపీ పుట్టల సునీత, మాజీ ఎంపీటీసీ పల్లా వీరయ్య, హెచ్‌ఎంలు రమేష్, లక్ష్మణ్‌నాయక్, నాయకులు బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, పల్లా వెంకన్న, సోమమ్మ, పుల్లయ్య, సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు



పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జూలై 15: రాజకీయాలకతీతంగా విలీన గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయనున్నట్లు మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం 14వ వార్డు మర్రిగూడలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్ఐసీ) కింద రూ.54 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను మునిసిపల్ వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, స్థానిక వార్డు కౌన్సిలర్ బొజ్జ శంకర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి వెంకట్‌రెడ్డి సహకారంతో రానున్న రెండేళ్లలో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని అన్నారు. అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను, మంచినీటి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డుపై కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కమిషనర్ సయ్యద్ ముసబ్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కౌన్సిలర్లు అశ్విని భాస్కర్‌గౌడ్, పబ్బు సాయిశ్రీ సందీప్‌గౌడ్, గురిజ వెంకన్నగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

యజ్ఞ యాగాలతో సమాజం సుభిక్షంగా ఉండాలి

నార్కట్‌పల్లి, జూలై 15: లోకకల్యాణం కాంక్షిస్తూ నిర్వహించే యజ్ఞ యాగాలతో సమాజం సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఐదు రోజుల పాటు జరిగే హోమ ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన యాగ ప్రారంభ వేడుకలకు ఆయన హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రజలు హాజరై భక్తిభావం పెంపొందించుకోవాలన్నారు. మానసిక ప్రశాంతత పొందాలని సూచించారు. ఎమ్మెల్యేను దేవస్థాన అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, జెరిపోతుల భరత్ పాల్గొన్నారు.

'లిఫ్టుల నిర్వహణను ప్రభుత్వమే చేపట్టాలి'



ఎత్తిపోతల మోటార్లను పరిశీలిస్తున్న రంగారెడ్డి

వేములపల్లి, జూలై 15: సాగర్ ఎడమకాల్వపై గల లిఫ్టుల నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే తీసుకొని రైతులపై భారం పడకుండా చూడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండల కేంద్రం సమీపంలోని ఎల్-14 లిఫ్టును సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సాగర్ ఆధునికీకరణలో భాగంగా సాగర్ ఎడమకాల్వపై గల 52 లిఫ్టులకు గాను రూ.200కోట్లు అవసరం ఉండగా కేవలం రూ.100 కోట్లతోనే ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లను మరమ్మతులు చేపట్టారే కాని ఎలాంటి సివిల్ పనులు చేపట్టలేదని ఆయన విమర్శించారు. లిఫ్టుల నిర్వహణకు ఆపరేటర్లను, హెల్పర్లను ప్రభుత్వమే నిర్వహించి తగిన వేతనాలను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి పాదూరి శశిధర్‌రెడ్డి, నాయకులు రొండి శ్రీనివాస్, మంగారెడ్డి, పాల్వాయి రాంరెడ్డి, పాదూరి గోవర్ధని, ప్రణీత్‌రెడ్డి, నారాయణరెడ్డి, సైదులు పాల్గొన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

మిర్యాలగూడ టౌన్, జూలై 15: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ కోరారు. పట్టణంలోని పలు వార్డుల్లో చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతోనే పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. పారిశుధ్య కార్యక్రమాల్లో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉబ్బపల్లి వెంకమ్మ, రాజు, సైదిరెడ్డి, అశోక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి

కేతేపల్లి, జూలై 15: మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో గల తెలంగాణ ఆదర్శ పాఠశాలను సోమవారం పంచాయతీరాజ్ డీఈఈ కొండయ్య పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణలో ఏర్పడిన మురుగునీటి గుంతలు, పేరుకుపోయిన చెత్తచెదారాలు, పెరిగిన పిచ్చి మొక్కలు, ఆరు బయట మధ్యాహ్న భోజన వంటలు సిద్ధం చేస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం పలువురు పాఠశాల విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సమస్యలపై సమీక్షించడానికి పాఠశాల ప్రిన్సిపాల్ సబితారెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఉపాధ్యాయులు, స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎక్స్‌కవేటర్‌ను రప్పించి పాఠశాల ఆవరణలోని మురుగు నీటి గుంతలను పూడ్చివేయించి, చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను శుభ్రం చేయించారు. మధ్యాహ్న భోజన మెనూ ప్రకారం నాణ్యతగా ఉండాలని ఏజెన్సీ సభ్యులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట కేతేపల్లి ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, మిషన్ భగీరథ ఏఈ మౌనిక, పీఆర్ ఏఈ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య ఉన్నారు.

'ప్రజావాణి'ని సద్వినియోగం చేసుకోవాలి

'ప్రజావాణి' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో పలువురు అధికారులు పాల్గొని ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రజావాణి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

● చింతపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు ప్రజల నుంచి వినతుల స్వీకరించారు. ఈ మేరకు గృహలక్ష్మి, ప్రభుత్వ పథకాల కోసం అర్జీలను ప్రత్యేక అధికారి నక్కుబాయి స్వీకరించారు.

● దేవరకొండ ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో 179 దరఖాస్తులు వచ్చినట్లు మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఇందిర, దేవరకొండ ఇన్‌చార్జి ఎంపీడీవో నీలిమ తెలిపారు. పంచాయతీరాజ్, గ్రామాల్లోని సమస్యలపై 131, రెవెన్యూకు సంబంధించిన వినతులు 47, విద్యాశాఖకు సంబంధించి ఒక వినతి పత్రం వచ్చినట్లు వారు పేర్కొన్నారు. దేవరకొండ మునిసిపాలిటీలో నిర్వహించిన ప్రజావాణిలో 12 దరఖాస్తులు వచ్చినట్లు మునిసిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రజాపాలనకు సంబంధించి 10, పింఛన్‌కు సంబంధించి ఒకటి, మునిసిపాలిటీకి సంబంధించి ఒక వినతిపత్రం వచ్చినట్లు పేర్కొన్నారు.

● కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురు దరఖాస్తులు అందించినట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అధికారులు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో 4దరఖాస్తులు అధికారులకు అందాయని ఎంపీడీవో బి. శ్రీనివాసరావు తెలిపారు.



కట్టంగూరులో అర్జీలను స్వీకరిస్తున్న అధికారులు

● పెద్దఅడిశర్లపల్లిలో 31 అర్జీలు వచ్చినట్లు ప్రత్యేకాధికారి మల్లేశ్వర్‌రావు, ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ తెలిపారు.

● కొండమల్లేపల్లిలో 34 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో రాంరెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● శాలిగౌరారంలో 7 ఫిర్యాదులు వచ్చినట్లు మండల స్పెషల్ ఆఫీసర్ రామారావు నాయక్ తెలిపారు.

● మర్రిగూడలో నిర్వహించిన ప్రజావాణికి 3 దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు ఎంపీడీవో మున్నయ్య తెలిపారు.

● నల్లగొండ మండలంలోని నర్సింగ్‌బట్ల గ్రామంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని నర్సింగ్‌భట్ల ఛత్రపతి శివాజీ యూత్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరికలు : వీరేశం



కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నకిరేకల్, జూలై 15: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని పన్నాలగూడెం క్యాంపు కార్యాలయంలో సోమవారం నకిరేకల్ మునిసిపల్ వైస్ చైర్మన్ మురారిశెట్టి ఉమారాణి కృష్ణమూర్తి, 20వ వార్డు కౌన్సిలర్ చౌగోని రాములమ్మ సైదులు ఎమ్మెల్యే వీరేశం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిరేకల్ మునిసిపాలిటీని సుందరీకరణ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వార్డులో నెలకొన్న ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి అభివృద్ధి చేసేందుకు నిరంతరం ముందుంటానన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం, నాయకులు పన్నాల రంగమ్మ రాఘవరెడ్డి, లింగాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ నూతన కమిటీ నియామకం



శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్, జూలై 15: టీడీపీ పట్టణ నూతన కమిటీని సోమవారం రాష్ట్ర కమిటీ నియమించింది. పార్టీ పట్టణ అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులుగా వడ్డెబోయిన శ్రీనివాస్, నుసుం నగేష్ నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా గర్దాసు ప్రభాకర్, ఎండీ. మదార్, కోశాధికారిగా వల్లంశెట్ల రమణకిషోర్‌తో పాటు సభ్యులను రాష్ట్ర కమిటీ నియమించింది. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నసీరుద్దీన్‌బాబా, అనంతరాములు, గోపాలకృష్ణ, కాశయ్య, వెంకటేశ్వర్లు, సైదులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యల పరిష్కారంలో విఫలం

మాడ్గులపల్లి, జూలై 15: రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లెంల శ్రీకర్ అన్నారు. సోమవారం చలో సెక్రటేరియేట్‌కు వెళ్తున్న డీవైఎఫ్ఐ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ, గ్రూప్-2,3 పరీక్షలను వెనువెంటనే నిర్వహిస్తే నిరుద్యోగులు పరీక్షలకు ఎలా ప్రిపేర్ అవుతారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రూప్స్ పోస్టులను పెంచి కొద్ది రోజులు వాయిదా వేయాలని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో తండు లింగయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి



ఎమ్మెల్యే బీఎల్‌ఆర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

మిర్యాలగూడ, చింతపల్లి, జూలై 15: అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు డబ్బీకార్ మల్లేష్, జిల్లా సహాయకార్యదర్శి మల్లు గౌతమ్‌రెడ్డి కోరారు. అంగన్‌వాడీటీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెం. 10ని రద్దు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ పెంచుతూ వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలన్నారు. దానికోసం ప్రభుత్వం కొత్తగా జీవోను విడుదల చేయాలని కోరారు. హెల్పర్లకు పాత పద్ధతిలోనే పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని అన్నారు. ఎమ్మెల్యే బీఎల్ఆర్ స్పందిస్తూ అంగన్‌వాడీల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బొందు పార్వతి, బెజ్జం నాగమణి, స్వరాజ్యం, రషీదా బేగం, గుంటి విజయ, రాధాభాయి, వసీమా బేగం, లక్ష్మి, నాగమ్మ, చంద్రకళ, జ్యోతి, యాదమ్మ, ఝాన్సీ పాల్గొన్నారు.

● తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌కు అంగన్‌వాడీ టీచర్లు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమావత్ పద్మ, ఎ.లక్ష్మి, వెంకటమ్మ, ఎన్.సునీత, జానకి, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : కమిషనర్

మిర్యాలగూడ టౌన్, జూలై 15: నిబంధనలు అతిక్రమించే యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ ఎండీ. యుసుఫ్ అన్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలను టీపీఎస్ అధికారులతో కలిసి పరిశీలించారు. రహదారులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన కట్టడాలను కూల్చివేశామన్నారు. వర్షాకాలంలో పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బంగారుగడ్డలో శిథిలావస్థకు చేరిన ఇంటిని కూల్చివేశామని తెలిపారు. డ్రైనేజీల్లో వ్యర్థాలు వేయవద్దని అన్నారు. కార్యక్రమంలో అధికారులు అక్బర్, మౌలానా, బాబా, పాషా పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం



చింతపల్లిలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం పండుగ అని, ఎమ్మెల్యే వేముల వీరేశం, నల్లగొండ డీఎస్పీ కొలను శివరాంరెడ్డి అన్నారు. రాష్ట్రంలో అన్ని మతాలు, వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉంటారని తెలిపారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు.

● చిట్యాలలో నిర్వహించిన మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని మాట్లాడారు. మత సామరస్యానికి ప్రతీక మొహర్రం పండుగ అని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు పోకల దేవాస్, జడల చినమల్లయ్య, ఏర్పుల పరమేశం, సిలివేరు శేఖర్, బెల్లి సత్తయ్య, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

● ఈ నెల 17వ తేదీన జరిగే మొహర్రం పండుగను శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అలం కమిటీ సభ్యులు, ఆర్గనైజర్లు, మత పెద్దలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మొహర్రంను నిర్వహించుకోవాలని అన్నారు. సమావేశంలో వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ వి.శంకర్, అల్లం కమిటీ సభ్యులు తహేరుబాయ్, బషీర్, హన్ను, పర్వేజు, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

● కట్టంగూరులో పీర్లను ఊరేగించారు. మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన పీర్లు కట్టంగూరులో ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● చింతపల్లి మండలం గొడుకొండ్లలో పీర్లను ఊరేగించారు. ఈ మేరకు పీర్లు ఎత్తుకొని దబ్బు వాయిద్యాల మధ్య ఇంటింటికీ తిరుగుతూ కులమతాలకతీతంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వహకులు మహమ్మద్ అక్బర్, బాబర్, జుబేర్. ఎండి.ఖలీల్‌బేగ్, షేక్.జహంగీర్, షకుర్, ఇలియాస్, నూరు సత్తయ్య, జంగయ్య, మదారు, మదారు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం ప్రజల ప్రత్యేక పూజలు



నార్కట్‌పల్లి : వరద పాశం సేవిస్తున్న కాంగ్రెస్ నేతలు



కొండమల్లేపల్లిలో బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న ప్రజలు

నార్కట్‌పల్లి, జూలై 15: వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ మండలంలోని చెర్వుగట్టులో గల ప్రసిద్ధ శైవక్షేత్రం పార్వతీ జడలరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం వరుణయాగం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సహార్చకులతో ఆలయ మహామంటపంలో పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను ఆసీనులను చేశారు. జలంతో నింపిన కలశాలను ఉంచి ప్రత్యేకంగా కలశపూజ నిర్వహించారు. అనంతరం వరదపాశం పోశారు. అంతకు ముందు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవంలో మాజీ సర్పంచ్ నేతకాని కృష్ణయ్య, నాయకులు రేగట్టె రాజశేఖర్‌రెడ్డి, రేగట్టె నవీన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, రమేష్, శంకర్, శివ పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని నాభిశిలకు అభిషేకం

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని నల్లగొండ రోడ్డులోని పాత ఊరిలో గ్రామ నాభిశిలకు సోమవారం స్థానికులు వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, బొడ్డుపల్లి రామలింగం, భూతరాజు సత్తయ్య, బోడ శ్రీను, నల్లగాసు మల్లేష్, లక్ష్మమ్మ, నల్లగాసు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

నకిరేకల్: కేంద్రంలో అధికారంలో బీజేపీ ప్రభుత్వం పాల్పడుతున్న మతోన్మాదాన్ని వ్యతిరేకించి విద్యారంగాన్ని పరిరక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ అన్నారు. నకిరేకల్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి మతోన్మాదంపై వైద్య, విజ్ఞాన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. దేశంలో విద్యాలయాలలో అభ్యుదయ భావాలపై బీజేపీ ప్రభుత్వ దాడులు పెంచుతూ శాస్త్రీయ విద్యా విధానాన్ని అనగదొక్కుతుందన్నారు.

మాడ్గులపల్లి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని షీటీం ఎస్ఐ కోటేష్ అన్నారు. మండలంలోని కుక్కడం ఆవాస గ్రామం చింతలగూడెంలో నూతన చట్టాలు, మహిళలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జరుగుతున్న వేధింపులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు షరీఫ్, భిక్షం, ప్రభాకర్, వాసి, తబిత, పోలీసు కళాబృందం పాల్గొన్నారు.

రామగిరి: బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నల్లగొండ పట్టణానికి చెందిన పెరిక మునికుమర్ స్థానిక పార్టీ కార్యాయలంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మునికుమర్ మాట్లాడుతూ అతి త్వరలోనే ఎస్సీ మోర్చా నూతన కమిటీని వేసి పార్టీని బలోపేతం చేస్తానన్నారు.

చండూరు: బెల్టుషాపులకు వైన్స్ నిర్వాహకులు మద్యం సరఫరా చేస్తే కఠినచర్యలు తప్పవని డీఎస్పీ శివరాంరెడ్డి హెచ్చరించారు. చండూరు సర్కిల్ పరిధిలోని చండూరు, మునుగోడు, కనగల్, గట్టుప్పల మండలాల పరిధిలో ఉన్న వైన్స్ యాజమానులతో సమావేశమై మాట్లాడారు. ఎవరైనా బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తే వారిపై కేసు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

మర్రిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ పాల్వాయి అనిల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని దామెరభీమనపల్లి, మర్రిగూడ, ఎరుగండ్లపల్లి గ్రామాల్లో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

మిర్యాలగూడ టౌన్: ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలని టీడీపీ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పోగుల సైదులుగౌడ్ డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా, జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందన్నారు.

కట్టంగూరు: కట్టంగూరులోని చెరువును కొందరు వ్యక్తులు ఆక్రమిస్తున్నారని దానిని నిలిపివేయాలని కోరుతూ కట్టంగూరుకు చెందిన కొంత మంది వ్యక్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

నార్కట్‌పల్లి: టీజీపీఎస్సీ ముట్టడి పిలుపు నేపథ్యంలో పోలీసులు నార్కట్‌పల్లి మండలంలో పలువురు విద్యార్థి నేతలను ముందస్తు అరెస్టు చేశారు. బొడిగె భరత్, వాడపల్లి నవీన్ తదితర విద్యార్థులున్నారు.

● బీ.వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల తవ్వకం ద్వారా వచ్చిన మట్టిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అల్లె పరమేష్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు.

అడవిదేవులపల్లి: మండల కేంద్రానికి చెందిన న్యాయవాది కంచుకొమ్ముల శ్రీనివాస్ మిర్యాలగూడ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రత్యేక ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయ్యారు.

శాలిగౌరారం: శాలిగౌరారం గ్రామపంచాయతీ నడిమిగుంటి గౌడ సంఘం అధ్యక్షుడిగా కర్నాటి శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నాగార్జునసాగర్: మలి దశ తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర సెక్రటరీగా సాగర్ హిల్‌కాలనీకి చెందిన జానకిరెడ్డి నియమితులయ్యారు.

దేవరకొండ: దేవరకొండలో సెక్రటరేట్ ముట్టడికి బయలుదేరుతున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేములరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణతోపాటు మరో ఇద్దరు విద్యార్థి సంఘాల నేతలను ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం వారిని విడుదల చేశారు

దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గంలో ఈ నెల 16న నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి పర్యటించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు లోకసాని శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

నార్కట్‌పల్లి: జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసేందుకు ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు.

రామగిరి: బీఎస్పీ నల్లగొండ నియోజకవర్గ ఇన్‌చార్జి చింత శివరామకృష్ణ బీజేపీలో చేరారు. ఆయన్ను ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

11 మంది పేకాట రాయుళ్ల అరెస్టు

● ***రూ. 58 వేల నగదు, 5 బైక్‌లు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం***

నల్లగొండ క్రైం, జూలై 15: నల్లగొండ పట్టణంలోని సావర్కర్ నగర్‌లో పేకాట ఆడుతున్న 11మందిని అరెస్టు చేసినట్లు నల్లగొండ టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపారు. పట్టణంలోని సావర్కర్ నగర్‌లోని పెట్రోలు బంక్ ఎదురుగా ఉన్న ఓ షట్టర్‌లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. పేకాట ఆడుతున్న బుడిగ వెంకటయ్య, గద్దల జానయ్య, కనగంటి ఉపేందర్, గనిపల్లి శంకరయ్య, జానపాటి రమేష్, తిరుమల శంకర్, రాకింది వెంకటేష్, చిక్కుల్ల వెంకన్న, కత్తుల మహేందర్, ఎరుకల లింగయ్య, గాదె శంకర్‌రెడ్డిలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.58,660వేల నగదు, 5 ద్విచక్ర వాహనాలు, 12 సెల్‌ఫోన్లను స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● ***ఇసుక ట్రాక్టర్ పట్టివేత***

నార్కట్‌పల్లి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. నల్లగొండ నుంచి నార్కట్‌పల్లి వైపునకు ఓ ట్రాక్టర్ అనుమతి లేకుండా ఇసుకను లోడు చేసుకుని నార్కట్‌పల్లి వైపునకు వస్తుందన్న విశ్వసనీయ సమాచారం మేరకు చెర్వుగట్టు శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.